సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.24

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.24, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.9°/23.4°


జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

లడ్డూ @ రూ.1.82 లక్షలు



వేలం పాటలో దక్కించుకున్న లడ్డూతో ఆదినారాయణ

నల్లమాడ: వినాయకుడి లడ్డూ అంటేనే ప్రత్యేకం. అందుకే స్వామివారి లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు రూ.లక్షలు వెచ్చించి వేలం పాడతారు. సోమవారం నల్లమాడ మండలం రాగానిపల్లిలో 15 కిలోల వినాయకుడి లడ్డూకు వేలం పాట నిర్వహించగా, ఆదినారాయణ అనే వ్యక్తి ఏకంగా రూ.1.82 లక్షలకు దక్కించుకున్నారు. రాగానిపల్లిలో గ్రామ కూడలిలో ఏటా చవితి రోజున వినాయకుడిని కొలువుదీర్చి...మూడో రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీ. నిమజ్జనం రోజున స్వామివారికి ప్రసాదంగా ఉంచిన లడ్డూ వేలం నిర్వహిస్తారు. ఈ సారి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ జయమ్మ భర్త ఆదినారాయణ దక్కించుకున్నారు. ఒక చిన్న గ్రామంలో వినాయకుడి లడ్డూ ధర లక్షకుపైగా పలకడంపై గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారూ ఆశ్చర్యపోయారు.



ప్రశాంతి నిలయం నుంచి నిమజ్జనానికి బయలుదేరిన ఏకదంతుడు



నిమజ్జనం సందర్భంగా ధర్మవరం దుర్గానగర్‌లో భక్తుల సందడి



ధర్మవరంలో నిమజ్జనం కోసం వినాయకులను క్రేన్‌తో తరలిస్తున్న దృశ్యం

గంగఒడికి గణనాథుడు

చవితి నాడు మంటపాల్లో కొలువుదీరి మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు సోమవారం గంగఒడికి చేరాడు. పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, మడకశిర తదితర ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనం కమనీయంగా సాగింది. 'గణ బప్పా మోరియా' 'గణేష్ మహరాజ్‌కి జై' అంటూ చిన్నాపెద్దా నృత్యాలు చేస్తూ పార్వతీ తనయుడికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. పుట్టపర్తిలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం కమనీయంగా సాగింది. ధర్మవరంలో నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ రత్న పర్యవేక్షించారు.

– సాక్షి బృందం



పుట్టపర్తిలో వినాయకుడి శోభయాత్రలో నృత్యాలు చేస్తున్న యువత



ప్రశాంతి నిలయంలో నిమజ్జనానికి ముందు వినాయక విగ్రహాల ఎదుట భక్తుల కళా ప్రదర్శన

పూలహారం @ రూ.70,300



స్వామివారి పూలహారంతో ముడుపన్న

రొళ్ల: ఇప్పటివరకూ మనం వినాయకుడి లడ్డూ వేలం చూసి ఉంటాం. రూ.లక్షలు పలికిన వాటి గురించి తెలుసుకుని ఉంటాం. రొళ్ల మండలం జీరిగేపల్లిలో మాత్రం వినాయకుడి మెడలోని పూలహారం వేలం వేస్తారు. ఏటా జరిగే కార్యక్రమంలో గ్రామస్తులు భారీగా పోటీపడతారు. ఈ సారి గ్రామానికి చెందిన ముడుపన్న అనే వ్యక్తి ఏకంగా రూ.70,300కు వేలంపాటలో స్వామివారి పూల హారాన్ని దక్కించుకున్నారు.

బంతిపూల మాలకు భారీ రేటు

జీరిగేపల్లి గ్రామంలో ఏటా స్వామివారికి చవితి రోజున బంతిపూలతో చేసిన మాల వేస్తారు. మూడోరోజు నిమజ్జనం సందర్భంగా ఆ హారాన్ని వేలం వేస్తారు. ఆ వచ్చిన డబ్బును మరుసటి సంవత్సరం స్వామివారిని కొలువుదీర్చేందుకు ఉపయోగిస్తారు. స్వామివారి పూలహారం దక్కించుకున్న వారికి మంచి జరుగుతుంది అని గ్రామస్తులు విశ్వాసం. అందుకే మామూలు బంతిపూల హారం కూడా వేల రూపాయలు పలుకుతుంది. ఈసారి ఏకంగా రూ.70,300కు ముడుపన్న దక్కించుకుని సంబరపడ్డాడు.

న్యూస్‌రీల్

ఇంటిపై జెండా.. టీడీపీ నేతల దాడి

- వైఎస్సార్ సీపీ నేత ఇంటి అద్దాలు ధ్వంసం



దాడిలో ధ్వంసమైన కిటికీ అద్దాలు

రొద్దం: ఇంటిపై వైఎస్సార్ సీపీ జెండా కట్టాడన్న కారణంతో టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నాయకుడి ఇంటిపై దాడికి తెగబడ్డారు. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని బీదానిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కరుబ ప్రభాకర్ తన ఇంటిపై వైఎస్సార్ సీపీ జెండా కట్టుకున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు సోమవారం ప్రభాకర్ ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ప్రభాకర్ ఇంట్లో లేకపోవడంతో ఆయన తల్లిదండ్రులతో టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో భయపడిపోయిన వారు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకోగా..ఆగ్రహించిన టీడీపీ నేతలు ఇంటి కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తన ఇంటిపై దాడిచేసిన టీడీపీ నాయకులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆస్తుల జోలికొస్తే కఠిన చర్యలు

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అక్కడక్కడా కొంతమంది ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు కూల్చేందుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు.

పైసలిస్తేనే ప్రసవం!



- ఎందుకు ఇంత లేట్ చేశారు...కాన్పు కష్టమే. పరిస్థితి సీరియస్‌గా ఉంది. ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లండి. లేకపోతే తల్లీబిడ్డకు ప్రమాదం.

...హిందూపురం జిల్లా ఆస్పత్రికు వచ్చే గర్భిణుల బంధువులు భయపడేలా వైద్యులు చెప్పే మాటలివి.

- మీరు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే రూ.50 వేలకు తగ్గకుండా ఫీజు అవుతుంది. పైగా ఇతర ఖర్చులుంటాయి. రూ.5 వేలు ఇవ్వండి ఇక్కడే ప్రసవం చేస్తాం. కాదంటే మీ ఇష్టం.

... కాస్త కనికరం చూపండని వేడుకుంటే... వైద్యుల బేరసారాలివి

- 'పురం' జిల్లా ఆస్పత్రిలో వైద్యుడికి మనీ జబ్బు
- 'గైనిక్'లో చేరితే డబ్బులివ్వాల్సిందేనని డిమాండ్
- సాధారణ కాన్పు.. సిజేరియన్‌కు వేర్వేరు రేట్లు
- డబ్బులివ్వక పోతే కనీసం పట్టించుకోని వైనం
- సకాలంలో వైద్యం అందక వారం రోజుల క్రితం శిశువు మృతి



హిందూపురం జిల్లా ఆస్పత్రిలోని గైనిక్ వార్డు

సాక్షి, పుట్టపర్తి: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ పైసలిస్తేనే వైద్యం అన్నట్లుగా మారింది పరిస్థితి. సర్కారు నుంచి జీతం తీసుకుంటున్న కొందరు వైద్యులు రోగుల నుంచీ భారీగా డిమాండ్ చేస్తున్నారు. డబ్బులివ్వని వారికి కనీసం పట్టించుకోవడం లేదు. హిందూపురం జిల్లా ఆస్పత్రిలో ఈ వసూళ్ల పర్వం మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గైనిక్ వార్డులో కాసులివ్వందే కాన్పు చేయరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్బులివ్వకపోతే నరకమే.!

ఆస్పత్రికి వచ్చే గర్భిణి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా.. వైద్యులు హడావుడి చేస్తున్నారు. ఆపై అత్యవసరంగా వైద్యం చేయాల్సి ఉందని.. ఆలస్యం చేయరాదని గర్భిణి కుటుంబీకులను భయపెడుతున్నారు. ప్రైవేటుకు వెళ్తే భారీగా చెల్లించాల్సి వస్తుందని, తమకే అంతో ఇంతో ఇస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసవం చేస్తామని చెబుతున్నారు. దీంతో చాలా మంది వైద్యులు అడిగినంత ముట్టజెబుతున్నారు. దీంతో వైద్యులు కూడా వారికి మెరుగైన సేవలు అందిస్తున్నారు. డబ్బులిచ్చుకోలేని వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారికి నరకం చూపుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులివ్వకపోతే ప్రసవ సమయం వచ్చినా వైద్యులు పట్టించుకోవడం లేదని, నర్సులకు విషయం చెబితే ఇష్టానుసారం మాట్లాడుతున్నారని బాధితులు చెబుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి సాధారణ కాన్పు చేస్తున్నారని. లేనిపక్షంలో చివరి నిమిషంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారని చెబుతున్నారు

రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకూ...

గర్భిణి ఆరోగ్య పరిస్థితిని బట్టి కాన్పు కోసం వైద్యులు రూ.2 వేల నుంచి రూ. 5 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడికి వచ్చేది ఎక్కువగా నిరుపేదలే కావడం... ప్రైవేటు పేరుతో భయపడిస్తుండటంతో వైద్యులు అడినంత ఇచ్చేందుకే వారు మొగ్గుచూపుతున్నారు.

దాక్టర్లందరూ కుమ్మక్కై..

హిందూపురం జిల్లా ఆస్పత్రి గైనిక్ వార్డులో రోజుకు సగటున ఐదుగురు గర్భిణులు ప్రసవం కోసం చేరుతున్నారు. ఈ లెక్కన నెలకు 120 నుంచి 150 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 100 వరకు సాధారణ కాన్పులు కాగా.. మిగతా సిజేరియన్ చేస్తున్నారు. అయితే ప్రతి గర్భిణితో రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వారి కండిషన్ ఆధారంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బు ఇచ్చిన వారికి సకాలంలో వైద్యం అందజేస్తున్నారు. ఇవ్వని వారిని నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే ఆ వార్డులో పని చేసే డాక్టర్లందరూ కుమ్మక్కై వసూళ్లకు పాల్పడుతున్నారా? లేక ఒకరిద్దరు మాత్రమే వసూళ్లు మొదలుపెట్టారా? అనేది స్పష్టంగా తెలియరాలేదు.

విషయం బయటకు పొక్కకుండా బెదిరింపులు

డబ్బులు ఇచ్చిన విషయం బయటికి పొక్కకుండా డాక్టర్లు జాగ్రత్త పడుతున్నారు. తమకు డబ్బులు ఇచ్చినట్లు బయటికి చెబితే.. ప్రసవం తర్వాత మళ్లీ చికిత్స చేయాల్సి ఉంటుందని.. అప్పుడు నిర్లక్ష్యం చేస్తామని బెదిరిస్తున్నారు. ఇచ్చినదీ.. తీసుకున్నదీ.. ఇద్దరి మధ్యనే ఉండాలని భయపెడుతున్నారు. ఏదైనా పొరపాటు జరిగినా... వైద్యం వికటించినా.. తమకు డబ్బులు ఇచ్చిన సంగతి చెప్పరాదని.. కావాలంటే డబ్బులు తిరిగి ఇచ్చేస్తామనే ఒప్పందం కూడా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఫిర్యాదు చేయండి



ఆస్పత్రిలో వైద్య సేవలు, మందులు పూర్తిగా ఉచితం. ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన పని లేదు. ఎవరైనా డబ్బులు అడిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయండి. విచారణ చేయించి.. ఆ తర్వాత చర్యలకు సిఫారసు చేస్తాం. వారం రోజుల క్రితం నవజాత శిశువు మరణంపై డాక్టర్ల నిర్లక్ష్యమనే ఫిర్యాదు నా దృష్టికి రాలేదు. బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పక విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రోహిల్‌కుమార్, సూపరింటెండెంట్, హిందూపురం జిల్లా ఆస్పత్రి

ఉచిత పంటల బీమా కొనసాగింపు

- వచ్చే రబీ నుంచి రైతుల నుంచి ప్రీమియం వసూలు



అనంతపురం అగ్రికల్చర్: ఉచిత పంటల బీమా పథకాన్ని ఈ ఖరీఫ్ వరకూ కొనసాగిస్తూ కూటమి సర్కారు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే రబీ నుంచి రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయనున్నారు. ఈ-క్రాప్ ఆధారంగా మండలం యూనిట్‌గా వాతావరణ ఆధారిత బీమా పథకం అమలవుతుందని పేర్కొన్నారు. మరిన్ని పంటలకు పంట దిగుబడి ఆధారంగా బీమా వర్తింపజేశారు.

- ప్రస్తుత ఖరీఫ్‌లో వాతావరణ బీమా పథకం కింద జిల్లాలో వేరుశనగ, పత్తి, అరటి, టమాట, చీనీ, దానిమ్మ పంటలకు వర్తిస్తుంది. రబీలో టమాటకు మాత్రమే వర్తిస్తుంది. శ్రీ సత్యసాయి జిల్లాలో అరటి మినహా మిగతా పంటలకు బీమా ఇచ్చారు. వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం, పంటల సాగు విస్తీర్ణం, ఆటోమేటిక్ వెదర్‌బేస్డ్ స్టేషన్ డేటా ప్రకారం వేరుశనగ హెక్టారుకు రూ.80 వేలు బీమా నిర్ణయించారు. పత్తి హెక్టారుకు రూ.95 వేలు, దానిమ్మకు రూ.1,87,500, అరటికి రూ.1.50 లక్షలు, చీనీ కి రూ.1,37,500, టమాటాకు రూ.80 వేలు ప్రకారం బీమా ఖరారు చేశారు.
- ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకం కింద పంట దిగుబడి ఆధారంగా మరికొన్ని పంటలకు బీమా వర్తింపజేశారు. జిల్లాలో గ్రామం యూనిట్‌గా కంది పంటను చేర్చారు. మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలను చేర్చారు. రబీలో పప్పుశనగ, వేరువనగ, వరి, జొన్న, మొక్కజొన్న పంటలకు బీమా వర్తింపజేశారు.
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కందిని చేర్చారు. ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి పంటలకు వర్తింపజేశారు. రబీలో వేరుశనగ, వరికి బీమా వర్తింపజేశారు.

ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి

నా భర్త ప్రభాకర్ అమడగూరు మండలం కస్సముద్రం సచివాలయంలో పశుసంవర్థక సహాయకుడిగా పనిచేసేవాడు. 2022 మార్చి 2న ఓడీసీ వద్ద బైక్‌పై నుంచి కిందపడ్డాడు. అప్పటి నుంచి జీవచ్ఛవంగా ఉండిపోయాడు. ప్రతి నెలా ఆయన మందుల కోసం రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే రూ.25 లక్షలపైబడి ఖర్చు చేశాం. అయినా నా భర్త ఆరోగ్యం బాగుపడలేదు. భర్త ఆరోగ్యం, పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారమైంది. నాపై దయచూపి నా భర్త ఉద్యోగం నాకు ఇవ్వండి.

– భాగ్యమ్మ, ఓడీసీ



భాగ్యమ్మ తన భర్త ప్రభాకర్‌ను ఆటోలో తీసుకురాగా, కలెక్టర్ చేతన్ ఆటో వద్దకే వచ్చి ఫిర్యాదు స్వీకరించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించం



'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరిక
- ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 174 అర్జీలు

ప్రశాంతి నిలయం: ''తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్ వరకూ వచ్చి అర్జీలు ఇస్తారు..వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి తప్పులు దొర్లినా.. క్షమించే ప్రసక్తే లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే అర్జీలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలి'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి కలెక్టర్, అధికారులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 174 అర్జీలు అందయి. కార్యక్రమం అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులతో సమీక్షించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి అదే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. కోర్టు కేసుల విషయంలో కౌంటర్ ఫైల్స్ దాఖలు చేయడంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్‌స్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీఈ రామకృష్ణన్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోవాలి

ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించడం, మేలైన సాగు యాజమాన్య పద్ధతులపై గురించి వివరించే లక్ష్యంతో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ రూపొందించిన 'పొలం పిలుస్తోంది' పోస్టర్లను కలెక్టర్, పలువురు అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాగులో రైతుకు తోడుగా నిలిచేందుకే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖలైన పట్టు, సేంద్రియ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలసి గ్రామ సభల ద్వారా రైతులను చైతన్యపరుస్తారన్నారు.

చేనేత ఉత్పత్తుల విక్రయాలకు ఊతం

- 13, 14 తేదీల్లో బయ్యర్, సెల్లర్ మీట్



పుట్టపర్తి టౌన్: చేనేత ఉత్పత్తుల అమ్మకాలు ప్రోత్సహించడానికి చేనేత జౌళిశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 13, 14 తేదీల్లో విజయవాడ ఎంజీ రోడ్డులోని శేష సాయి కల్యాణ మంటపంలో బయ్యర్, సెల్లర్ మీట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మీట్‌లో అన్ని జిల్లాల నుంచి సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్, చేనేత కళాకారులు తమ వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. వస్త్ర వ్యాపారులు, మాల్స్ యజమానులు మీట్‌కు విచ్చేసి తమ వ్యాపారాలకు కావలసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేతలను ప్రోత్సహించాలని కోరారు.

12న ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: కలెక్టరేట్‌లో ఈ నెల 12న సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల ప్రజా ప్రతినిధుల హాజరవుతారని పేర్కొన్నారు. ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుంచి 26.368 టీఎంసీలు కేటాయించారన్నారు. ఇందులో తాగునీటికి 10 టీఎంసీలు, 16. 368 టీఎంసీలు సాగునీటికి కేటాయించాల్సి వస్తోందన్నారు. లక్ష ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఐఏబీలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామన్నారు. చివరి ఆయకట్టుకూ నీరు అందించాలని లక్ష్యం విధించుకున్నట్లు తెలిపారు. ఎక్కువ రోజులు నీటిని అందించడానికి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతి అమలు, నీటి నిర్వహణకు రెవెన్యూ, పోలీసు, ఇంజినీరింగ్ అధికారులతో కమిటీలు, నాలుగు నెలల పాటు తాత్కాలిక లస్కర్ల ఏర్పాటు, 16 అద్దె వాహనాలు తదితర అంశాలను ఐఏబీ అజెండాలో పొందుపర్చినట్లు వివరించారు.

క్లుప్తంగా

గొర్రెల మందపై చిరుత దాడి



చిరుత దాడిలో మృతి చెందిన గొర్రె

అగళి: మండలంలోని కరిదాసనపల్లి గొల్లహట్టి గ్రామంలో గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. గ్రామానికి చెందిన కాపరి మంజునాథ్ తన గొర్రెలను సోమవారం మేపునకు సమీపంలోని అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఆ సమయంలో ఓ చిరుత దాడి చేసింది. ఓ గొర్రెను సగానికి పైగా తినేసింది. మరో గొర్రెను లాక్కెళ్లింది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పరిశీలించారు. చిరుత బారి నుంచి కాపాడాలంటూ అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

కదిరి అర్బన్: అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నెలపట్ల గ్రామానికి చెందిన రమేష్ (34) తన మేనల్లుడు సతీష్‌తో కలసి కొన్నేళ్ల క్రితమే వలస వచ్చి కుమ్మరవాండ్లపల్లిలో స్థిరపడ్డాడు. గ్రామాల్లో తిరుగుతూ స్టీల్, సిల్వర్ సామగ్రి విక్రయించి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం సతీష్ వేరుపడి సొంతంగా వ్యాపారం మొదలు పెట్టాడు. చిన్నప్పటి నుంచి తన వద్ద పెరిగిన మేనల్లుడు వదలి వేరుగా వ్యాపారం చేస్తుండడంతో మనస్తాపం చెందిన రమేష్ ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున విషయాన్ని గమనించిన ఆయన భార్య రమ్య వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. రమ్య ఫిర్యాదు మేరకు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం అనుకుని పురుగుల మందు తాగి...



మృతుడు అశోక్

యాడికి: ప్రమాదవశాత్తు మద్యం అనుకుని పురుగుల మందు తాగి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... యాడికి మండలం రాయలచెరువుకు చెందిన అశోక్ (23) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అశోక్ సోమవారం మధ్యాహ్నం ఫుల్‌గా తాగి మత్తులో జోగుతూ మరింత మద్యం అనుకుని పురుగుల మందు తాగి లయన్స్ క్లబ్ కార్యాలయం ఎదుట రోడ్డుపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న అశోక్ అన్న లోకేష్ అక్కడకు చేరుకుని వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక రాత్రి 7 గంటల సమయంలో అశోక్ మృతి చెందాడు. కాగా, ఘటనపై పోలీసులు మాట్లాడుతూ.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



భారత్ టీం-ఏ నూతన కెప్టెన్ మయాంక్ అగర్వాల్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం





అనంతపురానికి చేరుకున్న క్రికెటర్లు



స్టార్ క్రికెటర్ శివమ్ దూబేకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఘన స్వాగతం

అనంతపురం: దులీప్‌ట్రోఫీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరుగుతున్న మ్యాచుల్లో పాల్గొనేందుకు భారత్-ఏ, భారత్-బీ జట్ల క్రీడాకారులు సోమవారం అనంతపురం చేరుకున్నారు. రియాన్ పరాగ్, రింకూ సింగ్, శివమ్ ధూబే, ఖలీల్ అహమ్మద్, మయాంక్ అగర్వాల్, తిలక్ వర్మతో పాటు ఆంధ్రా స్టార్ నితీష్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. కాగా, భారత్ టీం-ఏకు కెప్టెన్‌గా ఉన్న శుభమన్ గిల్ బంగ్లాదేశ్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌కు ఎంపిక కావడంతో మయాంక్ అగర్వాల్‌ను కెప్టెన్‌గా నియమించారు. ఇక.. భారత్ టీం-డీలో అక్షర్ పటేల్ స్థానంలో నిషాంత్‌ను, తుషార్ దేశ్ పాండే స్థానంలో కావేరప్పను జట్టులోకి తీసుకున్నారు.



రియాన్ పరాగ్‌కు స్వాగతం



ప్రసిద్ధ్ కృష్ణను స్వాగతిస్తున్న దృశ్యం



రింకూ సింగ్, తదితరులు



వాషింగ్టన్ సుందర్



ముషీర్‌ఖాన్, సాయికిషోర్, సర్ఫరాజ్ ఖాన్

నిమజ్జన వేళ.. అప్రమత్తతే రక్ష

నిమజ్జన వేళ.. అప్రమత్తతే రక్ష అని అంటున్నారు అధికారులు, పర్యావరణ వేత్తలు. గణనాథుని వేడుకలు చివరి దశకు చేరుకుంటున్నాయి. మూడో రోజు సోమవారం సాయంత్రం నుంచి కొన్ని ప్రాంతాల్లో విగ్రహాల నిమజ్జనం మొదలైంది. ఆనందంతో నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- జిల్లాలో రెండు వేలకు పైగా వినాయక ప్రతిమలు
- సాధారణం నుంచి భారీ పరిమాణంలో కొలువుదీరిన గణనాథులు
- కొన్ని ప్రాంతాల్లో మొదలైన నిమజ్జనాలు



ధర్మవరం చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: వీధి వీధినా కొలువైన గణనాథులతో జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం కొలువుదీర్చిన ప్రతిమలను ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఘనంగా పూజలు నిర్వహించి మూడు, ఐదు, తొమ్మిదివ రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో మూడు రోజు సోమవారం కొన్ని ప్రాంతాల్లో గణనాథులను వేడుకగా నిమజ్జనానికి తరలించారు. ఈ సంబరం ఆనందంతో సాగాలంటే అప్రమత్తతే కీలకమంటున్నారు అధికారులు.

రెండు వేలకు పైగా మంటపాలు

జిల్లా వ్యాప్తంగా రెండు వేలకు పైగా మంటపాల్లో గణనాథులను కొలువుదీర్చారు. అత్యధికంగా హిందూపురంలో 250 వరకు ఏర్పాటయ్యాయి. ఇక చిన్న పరిమాణంలో ఉన్న ప్రతిమలు వందల్లోనే ఉన్నాయి. ఇళ్లలో ఏర్పాటు చేసిన గణపతులను శని, ఆదివారాల్లో నిమజ్జనం చేయగా... సోమవారం హిందూపురం శివారు ప్రాంతంతో పాటు పలు మండలాల్లో నిమజ్జనం వేడుకలు అంబరాన్ని అంటాయి. హిందూపురం పట్టణంలో ఏడో రోజు నిమజ్జనం చేయనున్నారు. ఇందుకు గుడ్డం కోనేరులో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. పలు చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో ఆయా ప్రాంతాల వాసులు ఎక్కడికక్కడ నిమజ్జనం చేసే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చిలమత్తూరు మండలంలో పలు గ్రామాల్లో ఓ వైపు నిమజ్జనాలు చేస్తున్నారు.

ఇలాంటి చోట దృష్టి సారించాలి..

- మంటపాలకు సమీపంలో విద్యుత్ తీగలు ఉంటే అనుకోకుండా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశముంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంటపాల్లో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.
- పట్టణ ప్రాంతాల్లో ఎత్తైన విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో డీజే బాక్సులు, వాహనాలపై ఎక్కి నిల్చోవడం పరిపాటిగా మారుతోంది. ఇలాంటి సందర్భాల్లో మార్గం మధ్యలో వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది.
- రహదారుల్లో వ్యతిరేక మార్గంలో ఊరేగించడం, ఎక్కువ మంది రోడ్డు మధ్యలో నడవడం చేస్తే వాహన ప్రమాదాలకు గురి కావచ్చు.

నిరంతర పర్యవేక్షణ అవసరం

గణేష్ విగ్రహాల ఏర్పాటు ఒక ఎత్తయితే వాటిని ఉంచే మంటపాల నిబంధనలను నిరంతరం నిర్వాహకులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏ చిన్న ప్రమాదం జరిగినా అది ఏ పరిణామాలు దారి తీస్తోందో చెప్పలేం. కాబట్టి నిమజ్జనం వరకూ విగ్రహాల వద్ద వంతుల వారీగా నిర్వాహకులు పర్యవేక్షిస్తూ ఉండాలి. అలాగే మద్యం మత్తులో వేడుకల్లో పాల్గొనడం, నిమజ్జన సమయంలో నీటిలోకి దిగి ప్రాణాల పైకి తెచ్చుకోవడం సరికాదని అధికారులు అంటున్నారు. ఉత్సవాలు ముగిసే వరకూ మద్యం జోలికి వెళ్లకుండా ఉండడమే ఉత్తమమని పేర్కొంటున్నారు.

నిమజ్జనాన్ని పర్యవేక్షించిన ఎస్పీ

ధర్మవరం అర్బన్: స్థానిక చెరువులో సోమవారం చేపట్టిన వినాయక ప్రతిమల నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ రత్న పర్యవేక్షించారు. చెరువులో క్రేన్‌ల సాయంతో వినాయక విగ్రహాలు వేస్తుండటంతో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

పటిష్ట ఏర్పాట్లు

విగ్రహ మంటపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే నిర్వాహకులకు పలు సూచనలు చేశాం. నిమజ్జనం జరిగే గుడ్డం కోనేరుతో పాటు కొట్నూరు, సూగూరు, ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంది ముందుకు పోతున్నాం.

– కేవీ మహేష్, డీఎస్పీ, హిందూపురం

కలెక్టరేట్‌కు కత్తితో వచ్చిన రైతు

- పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది
- ప్రత్యర్థులతో ప్రాణహాని..రక్షణకే తెచ్చానన్న రైతు



రామనారాయణను విచారిస్తున్న దృశ్యం



రామనారాయణ వెంట తెచ్చుకున్న కత్తి

ప్రశాంతి నిలయం: ఓ రైతు తన భూ సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించేందుకు అర్జీ కాపీతో పాటు కత్తిని వెంట తీసుకుని రావడం కలెక్టరేట్‌లో సోమవారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని బుక్కపట్నం మండలం చింతలయ్యగారిపల్లికి చెందిన రైతు రామనారాయణకు గ్రామంలో ఉన్న మూడెకరాల పొలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు తమ పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. నాలుగేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చాడు. కలెక్టరేట్ సెక్యూరిటీ సిబ్బంది తనిఖీల్లో కత్తి బయటపడడంతో అప్రమత్తమైన పోలీసులు రైతు రామనారాయణను విచారించారు. తన ప్రత్యర్థులతో ప్రాణహాని ఉందని, అందువల్లే రక్షణ కోసం కత్తి తీసుకువచ్చానని తెలిపాడు. దీంతో అతన్ని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి అర్జీ అందజేసిన తర్వాత పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి మరో మారు విచారించి వదిలిపెట్టారు.

అరుణాచల క్షేత్ర సందర్శనకు ప్రత్యేక బస్సు

ధర్మవరం అర్బన్: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ సందర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ధర్మవరం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న ధర్మవరం బస్టాండ్‌లో ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి వెళుతుంది. రానుపోను ఛార్జీలు ఒకరికి రూ.1,400 చొప్పున వసూలు చేస్తారు. పూర్తి వివరాలకు 63031 51302, 99592 25859లో సంప్రదించవచ్చు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

అనంతపురం: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. అనంతపురంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడిని శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లికి చెందిన గోగుల నారాయణ (75)గా పోలీసులు గుర్తించారు. సోమవారం రాత్రి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఆయనను ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నారాయణను స్థానికులు సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అయ్యో దేవుడా! ఎంత పనిచేశావయ్యా?

- కొడుకు కోసం వెళుతూ.. కానరాని లోకాలకు
- ద్విచక్ర వాహనంపై నుంచి పడి తల్లి మృతి
- భర్త ఒడిలోనే కన్నుమూసిన భార్య



మృతి చెందిన నాగరత్న

బత్తలపల్లి: తండ్రితో గొడవ పడి ఇల్లు విడిచిపోయిన కుమారుడి కోసం అన్వేషిస్తూ బయలుదేరిన తల్లి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. రోడ్డు ప్రమాదం ఆమెను పొట్టనబెట్టుకుంది. కొడుకు కోసం విలవిల్లాడుతూ ప్రాణాలు విడిచింది. వివరాలు... ధర్మవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన రామాంజనేయులు, నాగరత్న(39) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రజక వృత్తితో కుటుంబాన్ని పోషించుకునే వారు. కుమారుడు చైతన్య కియా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుమారుడికి పెళ్లి చేయాలని భావించిన తల్లిదండ్రులు ఇదే విషయమై చైతన్యతో చర్చించారు. ఆ సమయంలో తండ్రి, కుమారుడి మధ్య చిన్నపాటి వాదన చోటు చేసుకుంది. దీంతో కుమారుడు అలిగి అనంతపురంలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పెద్దమ్మ... చైతన్యకు సర్దిచెప్పింది. అనంతరం చైతన్య తన వద్ద ఉన్నట్లుగా చెల్లెలు నాగరత్నకు ఫోన్ చేసి తెలిపింది. అప్పటికే కుమారుడి గురించి బెంగ పెట్టుకున్న తల్లిదండ్రులు ఇద్దరూ ఆదివారం రాత్రి 11.30 గంటలకు ద్విచక్రవాహనంపై అనంతపురానికి బయలుదేరారు. బత్తలపల్లి నుంచి అనంతపురం వైపుగా ప్రయాణమైన వారు కొత్తగా రోడ్డు వేస్తున్న ప్రదేశంలో చాలా ఎత్తుగా ఉన్న వేగ నిరోధకాన్ని గమనించని రామాంజనేయులు అదే వేగంతో ముందుకు వెళ్లాడు. దీంతో బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న నాగరత్న అదుపు తప్పి కిందపడింది. తలకు తీవ్ర గాయమైన ఆమెను చూసి భర్త తల్లడిల్లిపోయాడు. 'అయ్యో దేవుడా! ఎంత పని చేశావయ్యా' అంటూ రోదిస్తుండగానే పోలీసులు అక్కడకు చేరుకుని బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే భర్త ఒడిలోనే ఆమె తుది శ్వాస విడిచింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభాలు



నేలమీద పడిపోయిన విద్యుత్ స్తంభం

నల్లమాడ: టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. వివరాలు... నల్లమాడ మండలంలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిని యర్రవంకపల్లి, మలకవేమల చెరువు నుంచి టిప్పర్ల ద్వారా రేయింబవళ్లు తరలిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటల ప్రాంతం బాపనకుంట వద్ద రోడ్డుపై మట్టి దింపి తిరిగి వెళుతున్న క్రమంలో రెడ్డిపల్లి బీసీ కాలనీలో 11కేవీ విద్యుత్ లైన్‌కు టిప్పర్ ట్రాలీ తగులుకుంది. అయితే డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో వరుసగా ఐదు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. మరో రెండు స్తంభాలు దెబ్బతిన్నాయి. మట్టి అన్‌లోడ్ చేసిన తర్వాత ట్రాలీని కిందకు దించకుండా డ్రైవర్ అలాగే రావడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు శేషాద్రిరెడ్డి, ఆది, గోపాల్‌రెడ్డి, శంకర, శ్రీనివాసులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన టిప్పర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: వివిధ కారణాలతో మృతి చెందిన పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కమలాకర్‌కు సంబంధించి ఆయన భార్య ముత్యాలమ్మకు రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో సోమవారం ఎస్పీ అందజేసి మాట్లాడారు. అలాగే ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ చంద్రానాయక్ భార్య శాంతమ్మకు కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఏఓ సుజాత పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 15 వినతులు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 15 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్ చేసి ఆదేశించారు. ఫిర్యాదుల పునావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖలో ఏఓలుగా పనిచేస్తున్న 13 మందికి ఆర్టీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అనంతపురం ఏఓ శ్రీనివాసులు కదిరి ఆర్టీఓగా నియమితులయ్యారు. హిందూపురం ఏఓ జాన్‌పాల్‌ను శ్రీకాకుళం జిల్లా ఆర్టీఓగా బదిలీ చేశారు.

రిలయన్స్ ఉద్యోగి దుర్మరణం

- మూడు రోజుల క్రితం ప్రమాదం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మల్లికార్జున (ఫైల్)

ధర్మవరం రూరల్: వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో రిలయన్స్ డిజిటల్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన మల్లికార్జున (34)కు భార్య శ్వేత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనంతపురంలోని రిలయన్స్ డిజిటల్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 5న పనిపై ధర్మవరానికి వచ్చిన ఆయన ద్విచక్ర వాహనంపై అదే రోజు తిరుగు ప్రయాణమయ్యాడు. ధర్మవరం మండలం గొల్లపల్లి సమీపంలో మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన ఉన్న పల్లంలోకి వాహనం బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మూడు రోజుల పాటు ఈ విషయం వెలుగు చూడలేదు. మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతుండడంతో సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ నరేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మల్లికార్జునగా నిర్ధారించి, సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- అడ్డుకోవడానికి వెళ్లిన పోలీస్ వాహనంపై రాళ్ల దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు... గ్రామానికి చెందిన తలారి కైలాస్, తలారి తిరుపాల్ కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో గ్రామస్తులు వెంటనే డయల్ 100కు సమాచారం చేరవేశారు. స్పందించిన రూరల్ ఎస్ఐ నాగేంద్ర... సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకున్నారు. ఆంజనేయస్వామి గుడి వద్ద వాహనాన్ని ఆపి సిబ్బందితో ఘర్షణ జరుగుతున్న ప్రాంతానికి కాలినడకన చేరుకున్నారు. అదే సమయంలో కొందరు అకతాయిలు మద్యం మత్తులో పోలీసులను బూతులు తిడుతూ రాయిని పోలీస్ జీపుపైకి విసిరారు. దీంతో జీపు అద్దం పగిలింది. అనుకోని సంఘటనకు ఉలిక్కి పడిన పోలీసులు వెంటనే అకతాయిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో ఎస్ఐపై, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం

విచ్చల విడిగా కర్ణాటక మద్యం

ఇటీవల గ్రామంలో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయాలు సాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. మద్యం ఎక్కడ బడితే అక్కడ దొరుకుతుండడంతో యువకులు మద్యానికి బానిసై గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామంలో మద్యం అక్రమ విక్రయాలను నియంత్రించాలని కోరారు.